క్లుప్తంగా

రహదారి భద్రతపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వరప్రసాద్

గాండ్లపెంట: రహదారి భద్రతా నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కదిరి ఎంవీఐ వరప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారిపై నడిచే సమయంలో వాహనాలను గమనించాలన్నారు. చిన్న పిల్లలు వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎంవీఐతో పాటు కార్యాలయం సిబ్బంది హరినాద్, ఉపాధ్యాయులు జయరాం, గంగాధర్, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



యర్రగుంటపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: వ్యాధులకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ పరిధిలోని యర్రగుంటపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారం రోజులుగా విద్యార్థులు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు అవగాహన ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, ఎన్ఎస్ఎస్ పోగ్రా ఆఫీసర్ యూనిట్–1 క్రిష్ణానాయక్, యూనిట్–2 హనుమంతరావ్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: ధర్మవరం నియోజకవర్గ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ధర్మవరం పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్ట కోసం స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యేని ఆయన నివాసంలో వడ్డెర సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులస్తులకు ప్రత్యేక గుర్తింపును ఇస్తున్న ఎమ్మెల్యే వెంట తామంతా నడుస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు..

నల్లచెరువు: కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ శకుంతలను ఎంపీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు ఎంపీడీఓ సమన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరి చూసుకోండి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసిన ఓటరు జాబితాను సరి చూసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఇటీవల తుది ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు. ఇందులో వివరాలను సరి చూసుకోవాలన్నారు. జాబితాలో ఎక్కడైనా మరణించిన, డబుల్ ఓటర్లు, గ్రామంలో లేని ఓటర్లను గుర్తించాలన్నారు. ఈ వివరాలను ఆన్‌లైన్లో సైతం సరి చూసుకోవచ్చన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారు ఉంటే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి వివరాలు ఇవ్వవచ్చన్నారు. సమావేశంలో ఏఓ జిలాని, డీటీ నరసింహులు, ఈడీటీ మనోజ్ కుమార్, హరిక్రిష్ణ, రెహమాన్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతే లక్ష్యం

- ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలతో లబ్ధి
- 20 ఎకరాల సువిశాల స్థలం ఈద్గా కోసం కేటాయింపు
- అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి
- ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి




ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, హాజరైన ముస్లింలు

ధర్మవరం: ముస్లిం మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున ఇతోధిక సాయం అందిస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముస్లింల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు సంక్షేమాన్ని అందించిన పాపాన పోలేదన్నారు. రంజాన్ తోఫాల పేరుతో సరుకులు అమ్ముకుని సొమ్ము చేసుకున్న నీచులు టీడీపీ నాయకులన్నారు. తాను 2009లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పుడు ధర్మవరంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు స్థలం లేక అవస్థలు పడుతుంటే పట్టణానికి సమీపంలో 20 ఎకరాల సువిశాల స్థలాన్ని ఈద్గా కోసం కేటాయించానన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం అక్కడ ఒక్కో ఎకరా రూ.3 కోట్లకు పైగానే ఉందన్నారు. గతంలో దుల్హన్ పథకం కింద టీడీపీ ప్రభుత్వం రూ.50 వేలు అరకొర ఇస్తుంటే, ఆ సాయాన్ని రూ.లక్షకు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 221 మందికి సాయం అందించామన్నారు. ధర్మవరం పట్టణంలో ఇచ్చిన 20 వేలకు పైగా ఇంటి స్థలాల్లో 30 శాతం మంది దాకా ముస్లింలున్నారన్నారు. పట్టణంలో షాదీఖానాల నిర్మాణం, రూ.40 లక్షలతో ఖబరస్థాన్ చుట్టూ ప్రహరీ నిర్మించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఈ నాలుగున్నరేళ్ల పాలనా కాలంలోనే 90 శాతం మందికి పథకాల ద్వారా రూ.3 వేల కోట్లకు పైగా నగదు జమ చేశామన్నారు.

చంద్రబాబు మోసాన్ని గుర్తించాలి

టీడీపీ హయాంలో ముస్లింలకు ఒక్క మంత్రి పదవి అయినా ఇచ్చారా అని ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రశ్నించారు. ముస్లింలను మోసగిస్తున్న చంద్రబాబు నైజాన్ని గుర్తించాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ముస్లింలకు డిప్యూటీ సీఎంతో పాటు చట్టసభల్లో సముచిత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలంతా వైఎస్సార్‌సీపీని బలపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ చాంద్ బాష, కరీం, స్టార్ ఖలీల్, ఎస్పీబాష, జాకీర్, ఉస్మాన్, కృష్ణాపురం షహీన్‌షా, సుబహాన్, అమీర్‌బాష, సరితాల బాష, హిదయతుల్లా, ఇక్బాల్, సాధిక్, రఫీ, రహంతుల్లా, సాదిక్, రఫి, ఫక్రుద్దీన్, బుర్హానుద్దీన్, నజీర్, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ విజయదుందుభి మోగిద్దాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

నల్లచెరువు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ మరోసారి కదిరి గడ్డపై విజయదుందుభి మోగిద్దామని కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బట్టీ హైదర్‌వలి నివాసంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో సమన్వయకర్త బీఎస్ మక్బూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి కార్యకర్త జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. ఆ కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ నెల 3న పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, పెద్ద మౌలాళి, షెక్షావలి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి,సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, బావాఖాన్, కల్లిపల్లి శ్రీనివాసులు, రామాంజనేయులు, పోలం సూర్యశేఖర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఉత్తన్న, నజీర్, సమీఉల్లా, దొడ్డెప్ప,రమణ, అక్బర్,బాబూరెడ్డి, మహమ్మద్‌రఫి, దామోదర్‌రెడ్డి, తదితరులున్నారు.

ప్రజలే సీఎం జగన్ బలం

తలుపుల: ప్రజల ఆశీర్వాదాలే సీఎం జగనన్న బలం అని నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ అన్నారు. మండలంలోని గంజివారిపల్లి, ఈదులకుంట్లపల్లి, అగ్రహారంపల్లి, గరికపల్లి, పల్లవాండ్లపల్లి, యర్రసానిపల్లి గ్రామాల్లో బుధవారం సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ పర్యటించారు. ఈదులకుంట్లపల్లి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, అగ్రహారంపల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. గరికపల్లికి చెందిన మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నక్రిష్ణారెడ్డి భార్య వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకున్న విషయాన్ని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి మాట్లాడారు. యర్రసానిపల్లి మాజీ ఉపసర్పంచ్ కుమార్ రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వివేకానందరెడ్డి, సుదాకర్‌రెడ్డి, రామాంజులురెడ్డి, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకే బాబు, యరమరెడ్డి, మురళి, మౌలా పాల్గొన్నారు.

కాలనీ నిర్మాణానికి స్థలం కేటాయించండి



కాలనీ వాసుల సమస్యలపై ఆరా తీస్తున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

ఎన్పీకుంట: మండల కేంద్రంలో ఆర్డీటీ సంస్థవారు నిర్మించి ఇచ్చే ఎస్సీ కాలనీకి ప్రభుత్వ స్థలం కేటాయించాలని పలువురు తహసీల్దార్ నరేంద్ర కుమార్‌ను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ ఆర్డీటీ స్కూలులో తహసీల్దార్ అధ్యక్షతన సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఎన్.పీ. కుంట గ్రామ పరిధిలో ఉన్న గ్రామసచివాలయం దక్షిణ భాగంలోని ఆక్రమిత ప్రభుత్వ భూమిలో మట్టిదిబ్బలను తొలగించి కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో విచారణ చేసి ప్రభుత్వభూమిని గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అలాగే శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని, తమ కాలనీలో ప్రభుత్వ పాఠశాలకు పక్కా భవనం, డ్రైనేజి సౌకర్యం కల్పించాలని అధికారులకు స్థానికులు కోరారు. కార్యక్రమంలో జమేదార్ నూర్‌మహమ్మద్, ఎస్సీ నాయకుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమం



బ్రోచర్లు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ధర్మవరం అర్బన్: ప్రతి ఇంటి ముంగిటకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని 22వ వార్డులో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి హాజరై వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. వార్డులో వెచ్చించిన నిధుల పట్టిక బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఇంటా లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి వలంటీర్లను నియమించి ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలు, మతాలు, కులాలు చూడకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు కూడా సంక్షేమ పథకాలు అందించామన్నారు. నిరుపేదలకు జగనన్న కాలనీల్లో ఇల్లు మంజూరు చేశారని తెలిపారు. పథకాలు మళ్లీ అందాలంటే జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రజలకు సంక్షేమ పాలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి, వార్డు కౌన్సిలర్ సుబ్బలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్‌లు చాంద్ బాషా, కుమార్, కత్తె పెద్దన్న, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, కత్తె ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రూ. వందల కోట్లతో 'కదిరి' అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



ఎమ్మెల్యే సిద్దారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వందల కోట్ల రూపాయలతో కదిరి పట్టణాన్ని అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు పార్నపల్లి రిజర్వాయర్ నుంచి ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్న నేపథ్యంలో, అందుకు ప్రత్యామ్నాయంగా చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరితగతిన పనులు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గత నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పేదలందరికీ స్థలాలు కేటాయించామన్నారు. పట్టాలను సత్వరమే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో 18 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణానికి 4 అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు కాగా, అందులో 3 భవనాలు పూర్తి చేశామన్నారు. ఇంకో భవనం త్వరలో పూర్తవుతుందన్నారు. వేమారెడ్డి సర్కిల్ నుంచి రాయలసీమ సర్కిల్ వరకు ఫోర్‌వే లైన్ ఏర్పాటు చేశామన్నారు. రూ. 20 లక్షలతో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కౌన్సిల్ ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు మంచి సహకారం అందజేశారన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది గజమాలలతో ఘనంగా సన్మానించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదలను విస్మరించాయన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుల, మత, ప్రాంతాలను పట్టించుకోకుండా బడుగు, బలహీన వర్గాలకు పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పరిటాల కుటుంబం నక్సల్స్‌ను అడ్డుపెట్టుకుని అభివృద్ధిని విస్మరించారన్నారు. మేము అధికారంలోకి రాగానే పేద ప్రజలను గుర్తించి, వారికి సొంత డబ్బుతో ఉచితంగా బోర్లు వేయించామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా హంద్రీనీవా నీటిని తీసుకొచ్చి అన్ని చెరువులను నింపినట్లు తెలిపారు. పేరూరు డ్యాంకు జలాలు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. త్వరలోనే రామగిరి బంగారు గనులను తెరిపించి కార్మికులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో అందరం కలసి పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలుపించుకుని, మరోమారు రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, సిద్ధన్న, చెన్నకేశవరెడ్డి, ఓబిరెడ్డి, రామ్మూర్తి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

కనగానపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు అందరూ సహకరించాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ముఖ్యంగా హౌసింగ్, ఉపాధిహామీ, విద్య, వ్యవసాయశాఖల అధికారులు మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిద్దామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, ఏఓ కృష్ణకుమారి, హౌసింగ్ ఏఈ చిరంజీవి, ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి, ఏపీఓ వెంకటేష్, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సేవా గుణాన్ని అలవర్చుకోండి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం రూరల్: సమాజంలో సేవ చేసే గుణాన్ని అలవర్చుకోవాలని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో ధర్మవరం కేహెచ్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు. వారం పాటు నిర్వహించిన క్యాంపు ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడిచి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టా నరసమ్మ, పంచాయితీ కార్యదర్శి గణేష్‌రెడ్డి, అధ్యాపకులు షమీవుల్లా, ఆనంద్, సచివాలయ సిబ్బంది నీరజ, ఏఎన్ఎంలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టా నరసింహులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో గురువారం మధ్యాహ్నం నిర్వహించే ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త బి.శాంతమ్మ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపటి నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు

కనగానపల్లి: మండలంలో శుక్రవారం నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం హేమలత తెలిపారు. ఫిబ్రవరి 2న కేఎన్ పాళ్యం, ముత్తువకుంట్ల, 3న కనగానపల్లి, ఎలకుంట్ల, తగరకుంట, తూంచర్ల, వేపకుంట, 4న మామిళ్లపల్లి, చంద్రశ్చర్లల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓలకు సన్మానం

కనగానపల్లి: బదిలీపై వెళ్తున్న కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల ఎంపీడీఓలను ఘనంగా సన్మానించారు. బుధవారం చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ అంజలీ, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓలు గంగావతిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్టీడీ శీనా, సన్నాయప్ప, నారాయణరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇక కనగానపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ అలివేలమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని, అంకె రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

నేడు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ధర్మవరం: నాగలూరు నుంచి యర్రగుంట క్రాస్ వైఎస్సార్ జంక్షన్ వరకు రూ.4 కోట్లతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గురువారం భూమిపూజ చేయనున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలన్నారు.

విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: చంద్రబాబు కాలనీకి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి విష ద్రావకం తాగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలనీకి చెందిన లక్ష్మణ్ చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఇంట్లో ఉన్న విష ద్రావకం తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో లక్ష్మణ్‌ను కదిరికి తరలించారు.

భార్య ఆచూకీ తెలపాలంటూ ఆందోళన

తనకల్లు: తన భార్య అనిత అదృశ్యమై 10 రోజులు కావస్తున్నా ఇంతవరకు పోలీసులు ఆమె ఆచూకీని కనిపెట్టలేదని, తమకు న్యాయం చేయాలంటూ ఈతోడుకు చెందిన భర్త మనోహర్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. గ్రామానికే చెందిన మరో వ్యక్తితో తన భార్య జనవరి 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. తాము 24న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు మాత్రం ఇంతవరకు న్యాయం చేయలేదన్నారు. కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజశేఖర్ వారితో మాట్లాడారు. ఎక్కడ ఉందో తెలుసుకొని, కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన సన్మానం



ప్రమదారాణిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

గాండ్లపెంట: మండల పరిధిలోని రెక్కమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సీవీ ప్రమదారాణిని సహచర ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గాండ్లపెంట, కదిరి ఎంఈఓలు క్రిష్ణానాయక్, చెన్నక్రిష్ణ హాజరయ్యారు. ఏడున్నర సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఆమె సేవలను పలువురు ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. సమావేశం అనంతరం రెక్కమాను ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం , పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి దుశ్శాలువతో ప్రధానోపాధ్యాయుల దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని కటారుపల్లి, గాండ్లపెంట, తుమ్మలబైలు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: యునైటెడ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య, ఉపాధ్యక్షుడు దామోదర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ తీసుకువచ్చిందన్నారు. ఎన్ఈపీ అమలుతో పేద విద్యార్థుల చదువు కుంటుపడుతుందన్నారు. దాని వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. వాటిని వ్యతిరేకిస్తూ చెన్నై నగరంలో చేపట్టబోయే ర్యాలీలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ పట్టణ నాయకులు పురుషోత్తం, యాసిన్, మురళి, విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, శ్రీనివాసులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

21న సీతారాముల కల్యాణోత్సవం

కదిరి టౌన్: కదిరి సేవా భారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21న కదిరి బాలుర కళాశాల ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు సేవా భారతి అధ్యక్షులు చెన్నరాయశెట్టి తెలిపారు. బుధవారం కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉన్న రథాలకు సేవా భారతి, బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. రథం 20 రోజుల పాటు కదిరి తాలూకా 10 మండలాల్లో పర్యటించి కదిరికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చాగంటి కోటేశ్వరరావు, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొంటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, నాయకులు తలుపుల గంగాధర్, సుదర్శన్, వెంకటేష్, డీల్ అంజనేయులు, హరి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



కమిషనర్ అంజయ్య

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా ఎం. అంజయ్య బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకొన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకులు మాధవరెడ్డి, చెన్నక్రిష్ణ, కేశప్ప సాయిగీత శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిషనర్ తెలిపారు.

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా రామమోహన్



పుట్టపర్తి: బుక్కపట్నం నూతన సబ్ రిజిస్ట్రార్‌గా రామమోహన్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసి బుక్కపట్నానికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శీనానాయక్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం తెలిసిందే.